క్లుప్తంగా

మహిళలకు దుస్తుల పంపిణీ



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రసాద్ కుటుంబసభ్యులు

మునగాల : మండల కేంద్రంలో గుండెపోటుతో మృతి చెందిన లకుమారపు రత్నమాల రెండవ నెల మాసికం సందర్భంగా ఆమె భర్త లకుమారపు వరప్రసాద్, కుటుంబసభ్యులు మునగాలలోని పలువురు నిరుపేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తన భార్య జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబ సభ్యులు నాగరాజు, శ్రీవైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సైదయ్య



ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కొండా సైదయ్య

చిలుకూరు : బీఆర్ఎస్ పార్టీ చిలుకూరు మండల అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కోదాడలో ఇటీవల ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, కొండా సైదయ్య బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వరుసగా 2 సార్లు పని చేశారు. అలాగే నారాయణపురం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికై జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నారు.

బీజేపీ మునగాల మండల ఉపాధ్యక్షుడిగా చినసైదులు



మునగాల : బీజేపీ మునగాల మండల ఉపాధ్యక్షుడిగా మండవ చినసైదులు నియమితులయ్యారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల మండల కోఆర్డినేటర్ మల్లెబోయిన అంజియాదవ్ సమక్షంలో ఆయనను ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా చినసైదులు మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపు కోసం పాటుపడతానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు లక్కీ డ్రా



లక్కీ డ్రా తీస్తున్న అకాడమీ కోఆర్డినేటర్ సురేష్, ప్రిన్సిపాల్ రెహానా

హుజూర్‌నగర్ : పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న నాన్ మైనార్టీ సీట్లకు శనివారం లక్కీ డ్రా నిర్వహించారు. అకాడమీ కోఆర్డినేటర్ సురేష్, ప్రిన్సిపాల్ రెహానాలు.. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సీట్లకు పది మంది, ఎస్సీ సీట్లకు ఐదుగురు, ఎస్టీ సీట్లకు ముగ్గురు, ఓసీ సీట్లకు ఇద్దరు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులు



గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండతండాలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఆరుగురు నాల్గవ తరగతి విద్యార్థులు గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తెలిపారు. సీటు సాధించిన విద్యార్థులను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, అంగన్‌వాడీ టీచరు సైదమ్మ ఉన్నారు.

ఐదవ తరగతిలో ప్రవేశానికి అర్హత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కె.లఖిల, ఎం.చరణ్య, డి.దీప్తి చందన, కె.సుష్మిత, కందుల వాణి, జి.వర్షిత్, జి.మోక్ష వర్షిత్, బి.దీక్షిత్ సాయి, ఏ.విగ్నేష్, హఫీజ్‌లు గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్షలో అర్హత పొంది సీటు సాధించారు. వారిని శనివారం ఆ పాఠశాల కరస్పాండెంట్ బుస్సా మహేష్, ప్రిన్సిపాల్ సులోచన అభినందించారు.

పాడి రైతులకు కష్టకాలం

- మేళ్లచెరువు మండలంలో వరిగడ్డి కొరత
- మేత దొరకక అలమటిస్తున్న పశువులు
- ఆందోళనలో వివిధ గ్రామాల రైతులు

మేళ్లచెరువు: ఈ యాసంగి సీజన్‌లో వరిసాగు తగ్గడంతోపాటు వ్యవసాయంలో యాంత్రీకరణ కారణంగా పశుగ్రాసానికి గడ్డుకాలం వచ్చి పడింది. దీంతో మేళ్లచెరువు మండలంలో మూగజీవాలకు వరిగడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. ఫలితంగా తమకు పశుపోషణ భారంగా మారుతుందని రైతులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఆవులు, గేదెలు 23,936 ఉన్నట్టు పశుసంవర్ధక శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలోని 14 గ్రామ పంచాయతీలు ఉండగా చాలా గ్రామాల రైతులు పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈసారి వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండక రైతులు పశుగ్రాసానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడ్డి లేక పశువులు అల్లాడుతుంటే రైతులు ఏమిచేయాలో తోచని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టుడుతున్నారు.



గడ్డిని కొనుగోలు చేసి తీసుకొస్తున్న రైతులు

ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి..

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా వరిసాగు విస్తీర్ణం తగ్గింగి. దీంతోపాటు బోర్లు, బావుల కింద సాగు చేసిన పొలాలు సైతం నీటి ఎద్దడితో ఎండిపోయాయి. ఇదిలా ఉంటే వరికోతల సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాల వినియోగం పెరిగింది. తద్వారా పశుగ్రాసం కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఎండల తీవ్రతతో ఎక్కడ కూడా గడ్డిపోచ మొలవట్లేదు. దీంతో రోజువారీగా పొలాలకు వెళ్లిన పశువులకు మేత దొరకక అలమటిస్తూ ఇంటిదారి పడుతున్నాయి. దీంతో తమ పశువులను కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ట్రక్కు గడ్డిని రూ.10వేల పైచిలుకు చెల్లించి కొనుగోలు చేస్తున్నామని పశువులు ఉన్న యాజమానులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఉచితంగా పశుగ్రాసం అందించడంతోపాటు గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే పశుగ్రాసం అందించాలి



మూగజీవాలకు రోజురోజుకు పశుగ్రాసం దొరకక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నిల్వ ఉన్న వరిగడ్డి పశువులకు రెండు నెలలుగా వేస్తున్నాం. ఎండల తీవ్రతకు మొలిచిన గడ్డి కూడా ఎండిపోతుంది. ఈనేపథ్యంలో ప్రభుత్వమే పశుగ్రాసం అందించాలి.

– మామిడి లక్ష్మయ్య, రాఘవాపురం

సబ్సిడీపై గడ్డి విత్తనాలు ఇస్తున్నాం

మండలంలోని రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేస్తున్నాం. అవసరమైన రైతులు గడ్డి విత్తనాలను తీసుకొని తమకు ఉన్న నీటి వనరులతో గడ్డిని పెంచుకొని గడ్డి కొరతను అధిగమించాలి. గడ్డి విత్తనాలు ఒక్కసారి వేస్తే రెండేళ్లపాటు గడ్డి కొతర ఉండదు.

– డాక్టర్ ఉషారాణి, పశువైద్యాధికారి, మేళ్లచెరువు

రసవత్తరంగా కొనసాగుతున్న ఎడ్ల పందేలు



బండ లాగుతున్న గిత్తలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో శ్రీకోదండరామస్వామి దేవాలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు శనివారం మూడవరోజు ఫ్లడ్ లైట్ల వెలుతురులో అర్ధరాత్రి వరకు రసవత్తరంగా కొనసాగాయి. ఈ సందర్భంగా కేటగిరీ విభాగంలో గిత్తల పోటీలను నిర్వాహకులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా, కృష్ణా, గుంటూరు, తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన సుమారు 13 జతల ఒంగోలు జాతి గిత్తలు పోటీలో తలపడ్డాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా మాఘం నవీన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య, ఎన్ఆర్ఐ బొగ్గుల మౌలాలి, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీటీసీ చెన్నయ్య, బొబ్బా సీతారామిరెడ్డి, యాదగిరి కోటయ్య, చింతల వెంకటనారాయణ, నరసింహారావు, జమీల్, నిజామ్, భద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగులమీరా, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు సిద్ధం కావాలి



అఫ్జల్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు

నడిగూడెం : కార్మికుల హక్కుల సాధనకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే ఫలాలను అందించాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. అనంతరం భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడిగా ఎండి.అఫ్జల్, ఉపాధ్యక్షులుగా పల్లపు శ్రీను, దేవరంగుల వీరన్న, గుంజ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి మల్లికార్జున్, సహాయ కార్యదర్శిగా దేవరంగుల దుర్గారావు, పల్లపు శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పల్లపు గోపాల్, మెండెం వీరయ్య, కోశాధికారిగా మేరె ధనయ్యతో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వెనుకబడిన విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షలను తనిఖీ చేస్తున్న అరుణకుమారి

నడిగూడెం : వెనుకబడిన విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హెచ్.అరుణ కుమారి సూచించారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో విద్యార్థినులు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 23న విద్యా సంవత్సరం పూర్తికానుందని, పరీక్షపత్రాల మూల్యాంకనం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వసంత, రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఆత్మకూర్(ఎస్) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని దాచారం, ఆత్మకూరు, నెమ్మికల్లు, ఏనుబాముల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరశర్మ, తహసీల్దార్ వినోద్‌కుమార్, వ్యవసాయ అధికారిణి దివ్య, ఏపీఎం మంజుల, ఏఈఓలు శైలజ, శివకుమార్, సీఈఓ పల్లం లక్ష్మారెడ్డి, సీసీ చందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నారాయణపురంలోని నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయం

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో కనకగుర్గమ్మ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, నవగ్రహ, జీవ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 21వ తేదీన విగ్రహాల ఊరేగింపు, 22న విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, 23న జలాధివాసం, కుంకమపూజ, 24న యంత్ర స్థాపన, కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మాధవగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. శనివారం చిలుకూరు మండలంలోని మాధవగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే చోట ప్రధానంగా తాగునీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పనులకు వచ్చిన వారి పేర్లు మాత్రమే మస్టర్ రాయాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన యువజన సంఘం నాయకుడు కె.శ్రీనాథ్ కుమారుడు శ్రీమాన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం పట్టణంలో నిరుపేదలు, వృద్ధులకు, అనాథ పిల్ల లకు అన్నదానం చేశారు. ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, చంటి, సతీష్, అరవింద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అనంతగిరి : మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.నవీన్‌కుమార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నడిగూడెం : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున నడిగూడెం మండలంలోని సిరిపురం, నారాయణపురం, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్‌కె.సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండల కేంద్రంతో పాటు కొండాపురం, మాధవగూడెం, సీతారాంతండా, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య శనివారం విలేకరులకు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోదాడ మండలంలో..

కోదాడరూరల్ : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లబండగూడెం, చిమిర్యాల, కేటీఎల్ ఫీడర్ పరిధిలోని రెడ్లకుంట, కాపుగల్లు అదేవిధంగా తొగర్రాయి సబ్ స్టేషన్ పరిధిలో తొగర్రాయి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ కోదాడ రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ సభకు రావాలని సీపీఐ నాయకులకు ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని రాజీవ్ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించబోయే ఎంపీ ఎన్నికల ప్రచార సభకు సీపీఐ నాయకులు హాజరు కావాలని కాంగ్రెస్ నాయకులు ఈడ్పుగంటి సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం సీపీఐ కార్యాలయానికి వెళ్లి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్ పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కోదాడరూరల్ : ఉపాధి హామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కోదాడ మండలంలోని గుడిబండలో ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య శాఖ సరఫరా చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన అందజేసి మాట్లాడారు. కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండలేని సమయంలో పని చేయాలని సూచించారు. అదేవిధంగా కూలీలు చేసిన పనికి వెంటనే బిల్లులు మంజూరు అయ్యేవిధంగా అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షం, మేట్లు, కూలీలు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం కొనసాగుతోంది. శనివారం ఆలయంలో చైత్ర శుద్ధ త్రయోదశి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు స్వామివార్ల ఊరేగింపు తదనంతరం పరమపద అధ్యయన ఉత్సవాలను నిర్వహించారు. ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం మఠంపల్లి మండలంలోని మట్టపల్లి పరిధిలో గల ఎన్‌సీఎల్ సిమెంట్ పరిశ్రమ అతిథి గృహంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు అన్ని బూత్ ల నుంచి తరలిరావాలన్నారు. గత 10 ఏళ్ల కాలంలో హుజూర్‌నగర్ ప్రాంతానికి బీఆర్ఎస్, బీజేపీలు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాముల శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, బచ్చలకూరి బాబు, కిషోర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సక్రునాయక్, మహాలక్ష్మి, రజితాసామ్యేలు, అప్పారావు, శ్రీనివాస్‌గౌడ్, భీముడునాయక్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిరుద్యోగుల కోసం పోరాటాలు చేశా

హుజూర్‌నగర్ : నిరుద్యోగుల కోసం అనేక పోరాటాలు చేశానని కాంగ్రెస్ బహిష్కృత నేత బి.జడ్సన్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని గ్రంథాలయంలో నిరుద్యోగులను ఆయన కలిసి మాట్లాడారు. తెలంగాణలో తనపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందని, అయినా నిరంతరం నిరుద్యోగుల కోసం పోరాడనని చెప్పారు. త్వరలో జరిగే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని, తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆయన కోరారు. గెలిచిన తర్వాత రెండు లక్షల ఉద్యోగుల భర్తీకి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించే విధంగా పోరాటం చేస్తానని తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.



నిరుద్యోగులతో మాట్లాడుతున్న బి.జడ్సన్

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపే లక్ష్యం

మునగాల : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజియాదవ్ కోరారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, వీఎల్ఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి రూ.9 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార సరళిని ఆయన వివరించారు. అనంతరం 71 బూత్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దాసరి మధు, మండల ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గోపి, టౌన్ అధ్యక్షుడు ఎల్లపు నగేష్, ప్రధాన కార్యదర్శి వీరబాబు, బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



బూత్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజియాదవ్

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నడిగూడెం : బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం బీజేపీ నాయులు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు జగన్, బండారు శోభారాణి, మేకల నాగరాజు, రౌతు వర్మ, భిక్షం, బడేటి నరేష్, కళ్యాణ్, కొండలు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు పంచామృతాభిషేకం



శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం వేద పండితుల వేదమంత్రోత్సవాల మధ్య మండప పూజ, పూలమంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులు, మూలవిరాట్‌లకు, ధ్వజస్తంభానికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆదివారం శ్రీసీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తూకంలో మోసం చేస్తే చర్యలు

మోతె : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసం చేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని జిల్లా మార్కెటింగ్ డీపీఎం ఆంజనేయులు, గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ డైరెక్టర్ సురేష్ అన్నారు. మండల పరిధిలోని హుస్సేనాబాద్‌లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేమ శాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఒక్కో లారీలో 750 బస్తాలను మాత్రమే లోడ్ వేయాలని, ఎక్కువ వేస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



హుస్సేనాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం ఆంజనేయులు

మట్టపల్లిలో వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాల మహోత్సవం నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లారీ, బస్సు ఢీ

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద శనివారం లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వైపు వరి పొట్టు లోడుతో వెళ్తున్న లారీ, మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.